క్లుప్తంగా

బాధ్యతలు స్వీకరించిన ఎస్సైలు


నరేష్


మహేందర్


ప్రసాద్

భీమిని: భీమిని, కన్నెపల్లి ఎస్సైలుగా మహేందర్, నరేష్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. మందమర్రి ఎస్సైగా విధులు నిర్వర్తిస్తున్న మహేందర్ భీమినికి బదిలీ కాగా, పీఎస్‌బీ రామగుండం నుంచి నరేష్ కన్నెపల్లికి బదిలీపై వచ్చారు. వీరిరువురు సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా పోలీస్‌స్టేషన్ సిబ్బంది పుష్పగుచ్ఛం ఇచ్చి స్వాగతం పలికారు. బాధ్యతలు స్వీకరించిన ఎస్సైలు మాట్లాడుతూ మండలాల్లో శాంతిభద్రత పరిరక్షణకు పాటుపడతామని పేర్కొన్నారు.

దండేపల్లి ఎస్సైగా ప్రసాద్

దండేపల్లి: దండేపల్లి ఎస్సైగా కె.ప్రసాద్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేసిన ఎస్సై సాంబమూర్తి, రామగుండం కమిషనరేట్ స్పెషల్ బ్రాంచికి బదిలీ అయ్యారు. దీంతో ఆయన స్థానంలో లక్సెట్టిపేట పోలీస్‌స్టేషన్ రెండో ఎస్సైగా పనిచేసిన ప్రసాద్ బదిలీపై ఇక్కడకు వచ్చారు. మండలంలో శాంతి భద్రతల పరిరక్షణకు కృషిచేస్తానన్నారు.

జీఎంగా మోహన్‌రెడ్డి బాధ్యతలు స్వీకరణ



మందమర్రిరూరల్: మందమర్రి ఏరియా జనరల్ మేనేజర్‌గా మోహన్ రెడ్డి సోమవారం ఏరియా జీఎం ఆఫీస్‌లోని ఛాంబర్‌లో బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఏరియా అధికారులు, యూనియన్‌ల ప్రతినిధులు, ఆఫీస్ సిబ్బంది జీఎంను కలిసి అభినందనలు తెలిపారు. మందమర్రి ఏరియాలో ఇదివరకు పని చేసిన జీఎం శ్రీనివాస్ బదిలీపై ఆర్జీ-1 డివిజన్‌కు బదిలీ కాగా మోహన్‌రెడ్డి ఆర్జీ-3 డివిజన్‌లోని ఓసీ-2లో ప్రాజెక్ట్ ఆఫీసర్‌గా పనిచేస్తూ మందమర్రి ఏరియాకి జీఎంగా పదోన్నతిపై వచ్చారు.

సత్యాగ్రహ దీక్ష జయప్రదం చేయండి



మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

తాండూర్: కలెక్టరేట్ ఎదుట ఈ నెల 8న టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి చేపట్టబోయే సత్యాగ్రహ దీక్షను జయప్రదం చేయాలని కాంగ్రెస్ పార్టీ ఉమ్మడి జిల్లా ప్రధానకార్యదర్శి సూరం రవీందర్‌రెడ్డి కోరారు. స్థానిక ప్రెస్‌క్లబ్‌లో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సత్యాగ్రహ దీక్ష అనంతరం సాయంత్రం భారీ బహిరంగ సభ ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. సభకు ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే, రాజస్థాన్ ముఖ్యమంత్రి అశోక్ గేహ్లాట్, పార్టీ రాష్ట్ర ఇన్‌చార్జీ మాణిక్‌రావు ఠాక్రే, ఏఐసీసీ జాతీయ నాయకులు జైరాం రమేష్, రోహిత్ చౌదరి హాజరవుతారన్నారు. కాంగ్రెస్ శ్రేణులు హాజరై విజయవంతం చేయాలని కోరారు.

నేడు జైపూర్‌లో 'భట్టి' పాదయాత్ర

జైపూర్: మండలంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో సీఎల్పీ నేత మల్లు భట్టి విక్రమార్క చేపట్టిన హాత్ సే హాత్ జోడో పాదయాత్ర 20వ రోజున మంగళవారం గంగిపల్లి గ్రామం నుంచి ఉదయం ప్రారంభమై ఎల్కంటి మీదుగా టేకుమట్ల గ్రామం నుంచి ఇందారం చేరుకుంటుంది. రాత్రి ఇందారంలో బస చేసి బుధవారం ఉదయం ఇందారం నుంచి శ్రీరాంపూర్‌కు పాదయాత్ర సాగుతుంది.

విధులు బహిష్కరణ

లక్సెట్టిపేట: ఢిల్లీలో గుర్తు తెలియని దుండగులు ప్రముఖ న్యాయవాది నర్వాల్‌ను హత్య చేసినందుకు స్థానిక మున్సిఫ్ మెజిస్ట్రేట్ కోర్టు న్యాయవాదులు సోమవారం కోర్టు ఎదుట నల్లబ్యాడ్జీలతో నిరసన వ్యక్తం చేశారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు సురేందర్ మాట్లాడుతూ.. న్యాయవాదులకు రక్షణ కరువైందని, దాడులు పెరుగుతున్నాయన్నారు. న్యాయవాదులపై జరుగుతున్న దాడులను తీవ్రంగా ఖండిస్తున్నట్లు తెలిపారు. రక్షణ కోసం ప్రత్యేక చట్టాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం నినాదాలు చేస్తూ విధులు బహిష్కరించి నిరసన తెలిపారు. కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి రాజేశ్వర్, న్యాయవాదులు కేతిరెడ్డి భూమరెడ్డి, కొమ్మిరెడ్డి సత్తన్న, ప్రదీప్‌కుమార్, రెడ్డిమల్ల ప్రకాశం, మల్లికార్జున్, శివశంకర్ పాల్గొన్నారు.

'ఉపాధి'కి ఆసరా..!

- ఏప్రిల్ 01 నుంచి కొత్త కూలిరేట్లు అమలు
- హర్షం వ్యక్తం చేస్తున్న జాబ్‌కార్డు హోల్డర్లు

జిల్లా సమాచారం
జాబ్‌కార్డులు 1.10లక్షలు
కూలీలు 2.50 లక్షలు
రోజువారీగా పనులకు హాజరవుతున్న కూలీలు:11వేలు


కన్నెపల్లి మండలం జన్కాపూర్‌లో ఉపాధి పనులు చేస్తున్న కూలీలు

పాతమంచిర్యాల: మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకంలో పని చేస్తున్న కూలీలకు కేంద్ర ప్రభుత్వం 2023-24ఆర్థిక సంవత్సరానికి కూలి రేట్లు పెంచుతూ ఉత్వర్వులు జారీ చేసింది. ప్రభుత్వం పెంచిన వేతనాల నిర్ణయంతో ఏప్రిల్ 01 నుంచి కూలీలకు కొత్త వేతనాల చెల్లింపులు అమల్లోకి వచ్చింది. గతంలో కూలీలకు రోజువారీ వేతనం రూ.257 ఉండగా కొత్త వేతనం ప్రకారం రూ.272 చెల్లించనున్నారు. దీంతో జిల్లాలోని 2.50లక్షల మంది కూలీలకు ప్రయోజనం కలుగనుంది. జిల్లాలో 2023-24సంవత్సరంలో ఉపాధి హామీ పథకంలో 260రకాల పనులు నిర్వహించాలని ప్రణాళికలు రూపొందించారు. 35లక్షల 63వేల పని దినాలు కాగా మెటీరియల్ కాంపోనెంట్ కింద రూ.64కోట్లు, కూలీల వేతనాలు రూ.97కోట్లు చెల్లించాలని అంచనాలు తయారు చేశారు. అందులో ముఖ్యంగా అమృత్‌సరోవర్ కార్యక్రమంలో చెరువుల ఆధునీకరణ, చేపల చెరువుల తవ్వకాలు, అటవీప్రాంతాల్లో నీటి కుంటలు, చెరువుల నిర్మాణాలు, పశునిరోధక కందకాల నిర్మాణాలు చేపట్టనున్నారు. కాగా కూలీలు 7గంటలు పని చేస్తేనే రోజులో రెండు సార్లు పని స్థలంలో నుంచి ఫొటోలు పంపిస్తే రూ.272 చెల్లించడం జరుగుతుందని, ఉపాధిహామీ అధికారులు తెలిపారు. ఉపాధిహామీ పథకంలో గతంలో స్టేట్ గవర్నమెంట్ ప్యాకేజీ కింద వేసవిలో కూలీలకు 30శాతం అదనపు కూలీ చెల్లించేవారు. కానీ కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన ఎన్ఐసీ సాఫ్ట్‌వేర్ వచ్చిన నుంచి కూలీలకు ఆ అవకాశం లేకుండా పోయింది. జిల్లాలో 1.10లక్షల జాబ్‌కార్డులు ఉండగా 2.50లక్షల మంది ఉపాధిహామీ కూలీలు ఉన్నారు. ప్రభుత్వం పెంచిన వేతనంతో 2.50లక్షల మంది ఉపాధి కూలీలు ప్రయోజనం పొందనున్నారు. ప్రభుత్వం ఉపాధిహామీ కూలీలకు వేతనం పెంచుతున్నట్లు నిర్ణయం తీసుకోవడంతో కూలీలు, జాబ్‌కార్డుహోల్డర్లు నుంచి సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

పని దినాలు సద్వినియోగం చేసుకోవాలి

జాబ్‌కార్డు దారులు 100రోజుల పనులకు హాజరై వారి పని దినాలు పూర్తి చేసుకోవాలి. ప్రతి కూలీ తనకు కెటాయించిన పనులు సకాలంలో పూర్తి చేసుకుని పూర్తిగా కూలీ పొందాలి. ప్రభుత్వం నిర్దేశించిన పని దినాలు ఈ ఆర్థిక సంవత్సరంలో పూర్తి చేసేలా కూలీలు సహకరించాలి.

– బి.శేషాద్రి, డీఆర్‌డీవో మంచిర్యాల

ప్రజావాణికి స్పందన కరువు


కన్నెపల్లి ప్రజావాణిలో పాల్గొన్న జెడ్పీ సీఈఓ

చెన్నూర్‌రూరల్: స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో సోమవారం ప్రజావాణి నిర్వహించగా స్పందన కరువయ్యింది. ఒక్క ఫిర్యాదు కూడా రాలేదు. మండల ప్రత్యేకాధికారి కృష్ణ, ఎంపీడీవో టి.శ్రీనివాస్, ఈజీఎస్ ఏపీవో గంగాభవాని, ఏవో కవిత, ఐకేపీ ఏపీఎం ప్రమీల, ఏఈపీఆర్ శివ, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

భీమిని: భీమిని, కన్నెపల్లి మండలాల్లో ప్రజావాణికి స్పెషల్ ఆఫీసర్ జెడ్పీ సీఈఓ నరేందర్, డీఎల్‌పీవో ఫణీందర్‌రావు హాజరయ్యారు. అర్జీదారులు ఎవరూ రాలేదు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ.. ఏమైనా సమస్యలు ఉంటే ప్రజావాణికి వచ్చి వినతులు సమర్పించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీడీవో రాధాకిషన్, సబ్దర్‌ఆలీ, ఎంపీవో సతీష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

వేమనపల్లి: స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ప్రజావాణికి ఎంపీడీఓ లక్ష్మయ్య, ఎంపీఓ బాపురావు, సీనియర్ అసిస్టెంట్ లక్ష్మీనారాయణ మాత్రమే హాజరయ్యారు. ఉపాధిహామీ టీఏలు, విద్యాశాఖలో పని చేసే సీఆర్పీలను కూర్చోబెట్టి మమా అనిపించారు. అన్ని శాఖల మండల స్థాయి అధికారులు హాజరుకాలేదు. దరఖాస్తులు కూడా రాలేదు.

బహిరంగ సభలో కాంగ్రెస్ 'బలగం' చూపాలి

- మాజీ ఎమ్మెల్సీ ప్రేంసాగర్‌రావు


దండేపల్లి: మాట్లాడుతున్న ప్రేంసాగర్‌రావు

దండేపల్లి/నస్పూర్: కాంగ్రెస్ ఆధ్వర్యంలో ఈ నెల 8న నస్పూర్‌లో నిర్వహించే కాంగ్రెస్ భారీ బహిరంగ సభలో కాంగ్రెస్ బలగాన్ని చూపించాలని మాజీ ఎమ్మెల్సీ ప్రేంసాగర్‌రావు అన్నారు. బహిరంగసభకు జన సమీకరణలో భాగంగా దండేపల్లి, నస్పూర్ మండలాల్లో పార్టీ కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డితో పాటు, రాజస్థాన్ సీఎం అశోక్, సీఎల్పీ నేత భట్టి, ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి వేణుగోపాల్‌తో పాటు పార్టీ సీనియర్ నాయకులు హాజరయ్యే ఈ సభకు ప్రతి గ్రామం నుంచి కార్యకర్తలు, నాయకులు, కాంగ్రెస్ అభిమానులు అధిక సంఖ్యలో హాజరై జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పార్టీ ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

సర్కారు స్కూళ్లలో విద్యార్థుల సంఖ్య పెంచాలి

- మంచిర్యాల ఎమ్మెల్యే దివాకర్‌రావు
- పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన


తాళ్లపేటలో భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే

దండేపల్లి: సర్కారు బడుల్లో విద్యార్థుల సంఖ్యను పెంచాలని మంచిర్యాల ఎమ్మెల్యే దివాకర్‌రావు అన్నారు. దండేపల్లి మండలం తాళ్లపేట ప్రాథమిక పాఠశాలలో 'మనఊరు-మనబడి' కార్యక్రమంలో భాగంగా రూ.19లక్షల నిధులతో చేపట్టే అదనపు తరగతి గదుల నిర్మాణంతో పాటు, ఇతర మౌలిక వసతుల పనులకు సోమవారం భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 'మనఊరు-మనబడి'తో ప్రభుత్వ పాఠశాలల్లో కార్పొరేట్ వసతులు కల్పిస్తున్నాం కాబట్టి ఉపాధ్యాయులు, గ్రామాల్లోని ప్రజాప్రతినిధులు కూడా ప్రత్యేక చొరవ తీసుకుని వచ్చే విద్యాసంవత్సరం వరకు ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యను పెంచాలన్నారు. డీసీఎమ్మెస్ చైర్మన్ లింగయ్య, ఎంపీపీ శ్రీనివాస్, రైతుసమితి జిల్లా కన్వీనర్ గురువయ్య, వైస్ ఎంపీపీ అనిల్, పీఏసీఎస్ చైర్మన్ లింగన్న, ఎంపీటీసీ హేమలత, సర్పంచ్ కళావతీ, ఉప సర్పంచ్ తిరుపతి, మాజీ వైస్‌ఎంపీపీ రాజేందర్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు శ్రీనివాస్, ఎంఈవో రవీందర్, హెచ్ఎంలు మల్లయ్య, శ్రీనివాస్, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

సీసీ రోడ్లు ప్రారంభం..

తాళ్లపేట, నాగసముద్రం, మేదరిపేట గ్రామాల్లో నూతనంగా నిర్మించిన సీసీ రోడ్లను ఎమ్మెల్యే దివాకర్‌రావు సోమవారం ప్రారంభించారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు, ఉపసర్పంచ్‌లు, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

వీవోఏల సమస్యలు పరిష్కరించాలి


ఏపీఎంకు సమ్మె నోటీసు అందజేస్తున్న వీవోఏలు


దండేపల్లి: వినతిపత్రం ఇస్తున్న వీవోఏలు

కోటపల్లి: ఐకేపీ వీవోఏల సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సోమవారం స్త్రీశక్తి భవనంలో ఏపీఎం రాజన్నకు వీవోఏల సంఘం సభ్యులు పలు డిమాండ్లతో కూడిన సమ్మె నోటీసు అందజేశారు. ప్రభుత్వం వీవోఏలను గుర్తించి కనీస వేతనం అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ నెల 3నుంచి వచ్చే నెల 16వరకు విధులు బహిష్కరిస్తున్నట్లు సంఘం సభ్యులు తెలిపారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు సురేశ్, రమాదేవి, నాగన్న, రాజేశ్వరి, మహేశ్వరి, రాజన్న పాల్గొన్నారు.

దండేపల్లి: తమకు కనీస వేతనం అందించాలని దండేపల్లి మండల వీఏవోలు డిమాండ్ చేశారు. తమ డిమాండ్ల సాధన కోసం ఈ నెల 3నుంచి విధులు బహిష్కరిస్తున్నట్లు పేర్కొన్నారు. డిమాండ్లతో కూడిన వినతిపత్రంను స్థానిక ఐకేపీ కార్యాలయంలో ఏపీఎం బ్రహ్మయ్యకు సోమవారం అందించారు. కార్యక్రమంలో వీఏవోల మండల అధ్యక్షురాలు అనంతలక్ష్మి, ప్రధాన కార్యదర్శి సత్తన్న, ఉపాధ్యక్షులు శ్రీనివాస్, విజయ, వీఏవోలు పాల్గొన్నారు.

వీవోఏల సమ్మె నోటీసు అందజేత

నెన్నెల: పెండింగ్‌లో ఉన్న ఐకేపీ వీవోఏల సమస్యలు పరిష్కరించాలంటూ ఏప్రిల్ నెల 17 నుంచి రాష్ట్ర వ్యాప్తంగా నిరవధిక సమ్మె చేస్తున్నట్లు ఐకేపీ ఏపీఎం విజయలక్ష్మికి నెన్నెల మండల వీఓఏలు సోమవారం సమ్మె నోటీసు అందజేశారు. సెర్ప్ ఉద్యోగులుగా గుర్తించి రూ.26వేల గౌరవ వేతనం పెంచుతూ పీఆర్సీ అమలు చేయాలని డిమాండ్ చేశారు. రూ.10లక్షల బీమా సౌకర్యం కల్పించి, గుర్తింపు కార్డులు అందజేయాలన్నారు. నోటీసు ఇచ్చిన వారిలో వీఓఏల సంఘం మండల అధ్యక్షుడు తైదల సమ్మయ్య, కార్యదర్శి లక్ష్మణ్ నియోజకవర్గ గౌరవ అధ్యక్షుడు గుర్రం మల్లేష్, ఉపాధ్యక్షురాలు మల్లేశ్వరి, వీఓఏలు గణేష్, ఊషన్న, భాగ్య, భూమన్న ఉన్నారు.

విశ్వబ్రాహ్మణులను ఆదుకోవాలి


మాట్లాడుతున్న కృష్ణమాచారి

జన్నారం: విశ్వబ్రాహ్మణులను ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకోవాలని విశ్వబ్రాహ్మణ సంఘం రాష్ట్ర నాయకుడు ఇల్లందుల కృష్ణమాచారి డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో సోమవారం సంఘ నాయకులతో సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కార్పొరేట్ జువెల్లర్‌తో స్వర్ణకారులు, అటవీశాఖ అధికారుల దాడుల వల్ల కార్పెంటర్లకు చేతినిండా పనిదొరకడం లేదని వాపోయారు. దీంతో చాలా చోట్ల కార్పెంటర్లు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో విశ్వబ్రాహ్మణులకు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేసి రూ.2వేల కోట్లు కేటాయించి, సబ్సిడీ రుణాలు అందించాలని, ఉచితంగా పనిముట్లు అందజేయాలన్నారు. వృత్తి పనులు చేసే వారిలో 50ఏళ్లు నిండిన విశ్వబ్రాహ్మణులకు ఆసరా పింఛన్లు అందించాలన్నారు. తెలంగాణ కోసం ఆత్మబలిదానం చేసిన శ్రీకాంతాచారి జయంతి, వర్ధంతి వేడుకలను ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో జన్నారం మండల స్వర్ణకార సంఘ అధ్యక్షుడు శ్రీరాముల గంగాధర్, నాయకులు ఉప్పుల శ్రీనివాస్, ముమ్మడి రమేష్ సత్యం, తునికి భూమయ్య, వేగ్యారపు ఆనందం, రాము, సాయి తదితరులు పాల్గొన్నారు.

బెస్ట్ వెల్‌బేబీ ప్రశంసాపత్రం అందజేత


బెస్ట్ వెల్‌బేబీ పత్రం అందిస్తున్న కలెక్టర్

భీమారం: జిల్లా కేంద్రంలో సోమవారం నిర్వహించిన జిల్లా స్థాయి వెల్‌బేబీ షో లో భీమారం గ్రామంలోని 6వ అంగన్‌వాడీ కేంద్రానికి చెందిన పోటు ఆధ్య అనే చిన్నారి ప్రతిభ చూపి కలెక్టర్ చేతుల మీదుగా వెల్‌బేబీ పత్రం అందుకుంది. ఈ మేరకు కలెక్టర్ సంతోష్ చిన్నారితో పాటు తల్లిని ప్రశంసించారు. ఇందులో చెన్నూర్ సీడీపీవో మనోరమ, అంగన్‌వాడీ టీచరు పెంద్రి స్వప్న పాల్గొన్నారు.

రిబేటుపై పన్ను వసూలు

లక్సెట్టిపేట: మున్సిపాలిటీ పరిధి ప్రస్తుత సంవత్సరం చెల్లించాల్సిన ఇంటి పన్నును రిబేటుపై పట్టణానికి చెందిన నూనె ప్రవీణ్ చెల్లించినట్లు మున్సిపల్ కమిషనర్ ఆకుల వెంకటేష్ సోమవారం తెలిపారు. 2023-24వ ఆర్థిక సంవత్సరానికి చెల్లించాల్సిన పన్నులు ఏప్రిల్ 30వ తేదీ లోపు చెల్లిస్తే ఐదు శాతం రిబేటుతో చెల్లించవచ్చని తెలిపారు.

ముగిసిన 'పోషణ్ పక్వాడ'

మంచిర్యాలటౌన్: పోషణ్ పక్వాడ పక్షం రోజుల కార్యక్రమం సోమవారంతో ముగిసింది. జిల్లా కేంద్రంలోని పలు అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులతో పోషకాహార అవగాహన ర్యాలీ, ప్రతిజ్ఞ వంటి కార్యక్రమాలు నిర్వహించారు. ఏసీసీ 3 అంగన్‌వాడీ కేంద్రంలో వార్డు కౌన్సిలర్ జోగుల శ్రీలత హాజరై గర్భిణులు, బాలింతలు, కిశోర బాలికలు, చిన్నారులు పోషకాహారంను తీసుకోవాలని చెబుతూ ప్రతిజ్ఞ చేయించారు.

సంక్షిప్త వార్తలు

ఘనంగా హనుమాన్ శోభాయాత్ర

మంచిర్యాలఅర్బన్: మంచిర్యాలలో హనుమాన్ భక్తులు సోమవారం రాత్రి హనుమాన్ శోభాయాత్ర ఘనంగా నిర్వహించారు. రాంనగర్ వీరహనుమాన్ టెంపుల్ నుంచి ఐబీ వెంకటేశ్వర టాకీస్ రోడ్, ముఖారం చౌరస్తా మీదుగా హనుమాన్ చిత్రపటంతో శోభాయాత్ర సాగింది.

ఆటో డ్రైవర్ కుటుంబానికి ఆర్థిక సాయం

బెల్లంపల్లి: నిరుపేద ఆటోడ్రైవర్ కుటుంబానికి సోమవారం మెడికల్ డిస్ట్రిబ్యూటర్స్ ఆర్థికసాయం చేసి ఆదుకున్నారు. బెల్లంపల్లికి చెందిన సర్వర్ అనే ఆటో డ్రైవర్ కొన్నేళ్ల పాటు మెడికల్ డిస్ట్రిబ్యూటర్స్ విభాగంలో ఆటో నడిపాడు. ఇటీవల అకాల మృతి చెందడంతో మంచిర్యాల, బెల్లంపల్లి మెడికల్ డిస్ట్రిబ్యూటర్స్ మానవతా దృక్పథంతో ముందుకు వచ్చి రూ.60వేలు బాధిత కుటుంబానికి అందజేశారు.

ఘనంగా శివాజీ వర్ధంతి

మంచిర్యాలటౌన్: ఛత్రపతి శివాజీ వర్ధంతిని పురస్కరించుకుని సోమవారం జిల్లా కేంద్రంలోని లక్ష్మీ థియేటర్ చౌరస్తా శివాజి గద్దె వద్ద శివాజీ విగ్రహ సాధన సమితి సభ్యులు నివాళులర్పించారు.

'కంటి వెలుగు' శిబిరం ప్రారంభం

మంచిర్యాలటౌన్: జిల్లా కేంద్రంలోని 13వ వార్డులోని బస్తీ దవాఖానలో సోమవారం కంటి వెలుగు శిబిరాన్ని మున్సిపల్ చైర్మన్ పెంట రాజయ్య ప్రారంభించారు.

ఉపాధి పనులు వేగవంతం చేయాలి

కోటపల్లి: ఉపాధిహామీ పనుల్లో వేగవంతం చేయాలని ఎంపీడీవో భాస్కర్ ఈజీఎస్ సిబ్బంది, కార్యదర్శులను ఆదేశించారు. మండల పరిషత్ కార్యాలయంలో ఈజీఎస్, పంచాయతీ కార్యదర్శులతో ఈజీఎస్ పనులపై సోమవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. వందరోజుల పనుల్లో వేగం పెంచాలని కూలీల హాజరుశాతం నమోదు చేయాలని సూచించారు. అభివృద్ధి పనుల్లో వేగం పెంచాలని పెండింగ్ పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో కార్యదర్శులు, ఈజీఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

సాదాసీదాగా మండల సమావేశం

తాండూర్: స్థానిక ఎంపీపీ కార్యాలయంలో సోమవారం ఎంపీపీ పూసాల ప్రణయ్‌కుమార్ అధ్యక్షతన మండల సమావేశం సాదాసీదాగా సాగింది. వ్యవసాయ సంబంధమైన సమస్యలు, విద్యుత్ సమస్యలపై చర్చించారు. ప్రగతి నివేదికలు చదివి వినిపించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ బానయ్య, ఎంపీడీవో ప్రవీణ్‌కుమార్, తహసీల్దార్ కవిత, సింగిల్‌విండో చైర్మన్ దత్తుమూర్తి, ఎంపీటీసీలు రవీందర్, శంకర్, యశోద, రజిత, పలుశాఖల అధికారులు తదితరులున్నారు.

13న తైబజార్ వేలం

చెన్నూర్: మున్సిపాలిటీ 2023-24 ఆర్థిక సంవత్సరంగాను తై బజార్, పశువుల సంత ఫీజుల వసూలు కోసం ఈ నెల 13న కార్యాలయం ఆవరణలో మధ్యాహ్నం 12గంటలకు వేలంను నిర్వహిస్తున్నట్లు మున్సిపాల్ కమిషనర్ గంగాధర్ తెలిపారు. అనంతరం మున్సిపాలిటీ పరిధిలో గల ఇంటి యాజమానులు ఇంటి పన్ను బకాయిలు ఈ నెల 30లోగా చెల్లిస్తే 5శాతం రాయితీ ఇవ్వనున్నట్లు తెలిపారు. పట్టణ ప్రజలు ఇంటి పన్నులతో పాటు నల్ల పన్నులు చెల్లించి మున్సిపాలిటీ అభివృద్ధికి సహకరించాలని తెలిపారు.

నేడు సన్నాహక సమావేశం

చెన్నూర్: పట్టణంలోని పాత మార్కెట్ కార్యాలయం ఆవరణలో మంగళవారం ఉదయం 11గంటలకు ఈ నెల 5న బాబు జగ్జీవన్‌రామ్ జయంతి, 11న జ్యోతిభా పూలే జయంతి, 14 అంబేద్కర్ జయంతి ఉత్సవాల విజయవంతం కోసం సన్నాహక సమావేశాన్ని నిర్వహిస్తున్నట్లు అంబేద్కర్ యువజన సంఘం నాయకులు రాజేశ్ ఒక ప్రకటనలో తెలిపారు. సమావేశానికి అంబేద్కర్ వాదులు, ఉద్యోగులు, యువకులు, మహిళలు, కుల సంఘాల నాయకులు హాజరుకావాలని కోరారు.

అభివృద్ధి పనుల పరిశీలన

వేమనపల్లి: శానిటేషన్ సిబ్బంది ప్రతిరోజూ ఉదయం 7గంటలకు పారిశుధ్య పనులకు హాజరు కావాలని ఎంపీడీవో లక్ష్మయ్య అన్నారు. ఎంపీఓ బాపురావుతో కలిసి మొబైల్ ఇన్‌స్పెక్షన్ యాప్‌లో భాగంగా కళ్లంపల్లి గ్రామపంచాయతీలో చేపడుతున్న పలు అభివృద్ధి పనులను పరిశీలించారు. ట్రాక్టర్ ద్వారా చెత్తను డంపింగ్‌యార్డుకు తరలించాలని, వందశాతం హరితహారం మొక్కలు బతికేలా చూడాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ పద్మ, కార్యదర్శి సుదర్శన్ తదితరులు పాల్గొన్నారు.

సీపీఆర్‌పై అవగాహన కలిగి ఉండాలి

కోటపల్లి: ప్రతి ఒక్కరూ సీపీఆర్‌పై అవగాహన కలిగి ఉండాలని డాక్టర్ సత్యనారాయణ అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం అధికారులకు సీపీఆర్‌పై అవగాహన కల్పించారు.

కుట్టు శిక్షణ ద్వారా జీవనోపాధి


పుస్తకాలు పంపిణీ చేస్తున్న అధికారులు

లక్సెట్టిపేట: మహిళలకు కుట్టు శిక్షణ ద్వారా జీవనోపాధి ఉంటుందని వయోజన విద్యాశాఖ జిల్లా ఇన్‌చార్జి పురుషోత్తం నాయక్ అన్నారు. మండలంలోని చందారం గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో సోమవారం ఏర్పాటు చేసిన ఉచిత కుట్టు శిక్షణకేంద్రాన్ని ప్రారంభించి మాట్లాడారు. మహిళలకు స్వయం ఉపాధి అవకాశాలు పెంపొందించుటకు అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. అనంతరం పుస్తకాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ అన్నం మంగ, ఎంపీడీవో నాగేశ్వర్‌రెడ్డి, డీఆర్పీలు కందుల తిరుపతి, రెడ్డిమల్ల ప్రకాశం, అశోక్‌రావు నాయకులు పాల్గొన్నారు.

క్షేత్రస్థాయి నుంచి బీజేపీని బలోపేతం చేయాలి


మాట్లాడుతున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు రఘునాథ్

బెల్లంపల్లి: స్థానిక అసెంబ్లీ నియోజకవర్గంలో క్షేత్ర స్థాయి నుంచి పార్టీని బలోపేతం చేయడానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు వెరబెల్లి రఘునాథ్ సూచించారు. బెల్లంపల్లిలో సోమవారం నిర్వహించిన బీజేపీ బూత్ కమిటీ సమీక్ష సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. బూత్ స్వశక్తికరణ్ కార్యక్రమాన్ని బెల్లంపల్లి నియోజకవర్గంలో నిర్దేశించిన గడువులోగా పూర్తి చేయాలని, శ్రేణులకు సూచించారు. రాబోయే ఎన్నికల్లో బీజేపీ విజయం సాధించడం లక్ష్యంగా ప్రతి కార్యకర్త పని చేయాలన్నారు. సమావేశంలో బీజేపీ జిల్లా ఉపాధ్యక్షులు పులగం తిరుపతి, బొమ్మెన హరీష్ గౌడ్, జిల్లా ప్రధాన కార్యదర్శి మునిమంద రమేష్, బెల్లంపల్లి అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జి అన్నపూర్ణ సుదర్శన్ గౌడ్, ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మళ్లీ బోర్డు పాతారు..!



తాండూర్: ఆక్రమణకు గురైన భూమిని ప్రభుత్వ భూమి అని తెలిసే విధంగా రెవెన్యూ అధికారులు సోమవారం మళ్లీ బోర్డును ఏర్పాటు చేశారు. తాండూర్ మండలం రేచిని రోడ్డు రైల్వేస్టేషన్ సమీపంలోని ప్రభుత్వ భూమి ఆక్రమణకు గురైనట్లు వార్తలు వచ్చిన నేపథ్యంలో 20రోజుల క్రితం రెవెన్యూ అధికారులు బోర్డు పాతారు. ఆ బోర్డును గుర్తు తెలియని వ్యక్తులు రెండు రోజుల క్రితం తొలగించడంతో విషయం తెలుసుకున్న తహసీల్దార్ కవిత ఆదేశాల మేరకు ఆర్ఐ ఏజాజోద్దీన్, రెవెన్యూ సిబ్బందితో కలిసి మళ్లీ బోర్డు ఏర్పాటు చేశారు. ఈ హెచ్చరిక బోర్డును ఎవరు తొలగించినా శాఖపరమైన చర్యలు తీసుకుంటామని అధికారులు హెచ్చరించారు.

ఘనంగా సీతారాముల రథోత్సవం


రథోత్సవంలో పాల్గొన్న భక్తులు

రామకృష్ణాపూర్: సీతారాముల కల్యాణమహోత్సవంలో భాగంగా సోమవారం రాత్రి పట్టణంలో శోభాయాత్రను ఘనంగా నిర్వహించారు. స్థానిక కోదండ రామాలయం నుంచి సూపర్‌బజార్, బీజోన్ మీదుగా ఆలయం వరకు యాత్ర నిర్వహించారు. మహిళలు కోలాటం ఆడుతూ, నృత్యాలు చేస్తూ రథోత్సవంలో ఉత్సాహంగా పాల్గొన్నారు. ఆలయ అర్చకులు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.